క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామకృష్ణ

కొడవలూరు : రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్బీఎస్కే)లో భాగంగా కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక దర్గా సంఘం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్తగ్రూపు, హిమోగ్లోబిన్ శాతం, ఎత్తు, బరువు, ఇతర ఆరోగ్య సమస్యలను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఆర్బీఎస్కే కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలల విద్యార్థులకు అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆరోగ్య కార్డులలో నమోదు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తామన్నారు. ఈనెల 7న జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థుల ఆరోగ్య కార్డులను అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్ఎస్.వి.రామ్మోహన్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్ఎంలు శేషుబాయి, సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఆన్‌లైన్ లావాదేవీలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీజీబీ జొన్నవాడ బ్రాంచ్ మేనేజర్ సురేష్ అన్నారు. జొన్నవాడలో ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆన్‌లైన్ లావాదేవీలు జరిపేటప్పుడు ఒకటికి రెండు సార్లు వివరాలు సరిచూసుకోవాలన్నారు. ట్రీస్ సంస్థ కార్యదర్శి అహ్మద్‌బాషా మాట్లాడుతూ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఓటీపీ, బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. సంఘబంధం అధ్యక్షురాలు కామేశ్వరి, సభ్యులు కృష్ణవేణి, శైలజ, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనోత్సవం



ప్రత్యేకాలంకరణలో శివలింగం

పొదలకూరు : కార్తీక మాస ఆకాశ దీప నిమజ్జనోత్సవం పట్టణంలో సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. మహిళలు వందల సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. తొలుత స్థానిక శివాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన ఆకాశదీపం రాపూరు మార్గం డేగపూడి వరకు సాగింది. భజన పాటలు, శివనామ సంకీర్తనలతో పట్టణం మారుమోగింది. చివరగా ఏటికాలువలో మహిళలు ప్రమిదలను వదిలి నిమజ్జనోత్సవం గావించారు.

• పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాస ఆకాశ దీప నిమజ్జనోత్సవాన్ని దేవస్థానం కమిటీ వైభవంగా నిర్వహించింది. నెలరోజుల పాటు మహిళలు ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపానికి నూనె పోసి వెలిగించారు. డేగపూడి ఏటికాలువలో ఆకాశ దీపాన్ని నిమజ్జనం చేశారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కోవూరు : కోవూరు జాతీయ రహదారి వద్ద సాయిబాబా మందిరం ఎదురుగా ఉన్న అండర్ బ్రిడ్జి కింద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు సోమవారం స్థానికులు గుర్తించారు. గత కొంతకాలంగా చుట్టుపక్కల భిక్షాటన చేస్తున్నారని, వర్షాల వల్ల చలిజ్వరంతో ఆరోగ్యం క్షీణించి మృతిచెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



తోటపల్లిగూడూరు : మండలంలోని రావూరివారి కండ్రిగ సమీపంలో ప్రమాదకరంగా మారిన రహదారిలో స్థానికులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. తోటపల్లిగూడూరు-కాకుపల్లి గ్రామాల మధ్య ఉన్న రావూరివారికండ్రిగ సమీపంలో రహదారి డబుల్ రోడ్డు కావడంతో వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి. దీనిపై అధికారులకు మొరపెట్టుకున్నా ఉపయోగం లేకపోవడంతో స్థానికుడు ఎండ్లూరి అంజనేయులు స్పందించి సోమవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

వదలని వర్షం

- నిలిచిపోయిన వ్యవసాయ పనులు
- పలు ప్రాంతాల్లో నీట మునిగిన పొలాలు
- రోజువారీ పనులకు తీవ్ర ఆటంకం

పొదలకూరు : పొదలకూరు పరిసర ప్రాంతాల్లో సోమవారం కూడా విడవకుండా వర్షం జల్లులుగా కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఫెంగల్ తుఫాను ప్రభావం వల్ల ఆదివారం వరకు కురిసిన వర్షం వల్ల వ్యవసాయ పనులు నిలిచిపోవడమే కాక సాధారణ ప్రజలు ఏ పనులు చేసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో తుఫాను ప్రభావం తగ్గినా వర్షాలు కురుస్తూనే ఉండడం వల్ల ప్రజలకు చికాకుగా ఉందంటున్నారు. ఎండ రావడం వెంటనే కారుమబ్బులు కమ్ముకుని 5 నుంచి 10 నిమిషాల పాటు భారీ వర్షం కురుస్తోంది. దీంతో ప్రజలు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రాకపోకలు కూడా స్తంభించిపోవడంతో వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

ఉధృతంగా అల్లూర్తి వాగు

మండలంలోని అల్లూర్తి కొండవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పైతట్టు ప్రాంతంలో సోమశిల నీరు వాగులో కలుస్తున్న క్రమంలో ఆదివారం ఓ మోస్తరుగా ఉన్న వాగు సోమవారం నాటికి ఉధృతమైనట్లు గ్రామస్తులు వెల్లడించారు. దీంతో నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామస్తులు అల్లూర్తి మీదుగా పొదలకూరుకు రాకపోకలు స్తంభించాయి.

కాలనీలు, వరినార్లు జలమయం

ముత్తుకూరు : తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. నారుమడులు నీటి పాలయ్యాయి. ముత్తుకూరు ఆర్అండ్ఆర్ కాలనీలోని జగనన్న కాలనీ, బ్రహ్మదేవి, ఇందిరమ్మ కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లు రొచ్చురొచ్చు అయ్యాయి. చెత్త కుప్పల నుంచి దుర్గంధం వ్యాపిస్తోంది. పంటపాళెం, వల్లూరు, డమ్మాయపాళెం తదితర గ్రామాల్లో నారుమడులు నీట మునిగి రైతులను ఆందోళనకు గురిచేశాయి. సోమవారం కూడా భారీ వర్షం కురిసింది.



పొదలకూరు పట్టణంలో కురుస్తున్న వర్షం



పొదలకూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న అల్లూర్తి కొండవాగు



ముత్తుకూరులో జలమయమైన కాలనీ



పంటపాళెం వద్ద నీట మునిగిన నారు మడులు

జాతీయ పోటీలకు గొలగమూడి విద్యార్థిని



హారికను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వెంకటాచలం : మహారాష్ట్రలోని జల్‌గాన్‌లో ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు గొలగమూడి విద్యార్థిని ఎంపికైంది. గొలగమూడిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.హారిక రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ క్రమంలో హారికను పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీకామేశ్వరిదేవి, పీడీ షేక్.షబిక, ఉపాధ్యాయులు అభినందించారు.

బైక్‌ను ఢీకొన్న టూరిస్టు బస్సు

- వృద్ధుడికి తీవ్రగాయాలు



ప్రమాదంపై ఆరాతీస్తున్న సీఐ

పొదలకూరు : మోటార్ బైక్‌ను టూరిస్టు బస్సు ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణానికి సమీపంలో నెల్లూరు మార్గం వే బ్రిడ్జి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామానికి చెందిన తిరుపాలయ్య(70) నెల్లూరు నుంచి చేజర్ల మండలం ఆదూరుపల్లి మీదుగా బట్టేపాడుకు వెళ్లేందుకు పొదలకూరుకు బైక్‌పై వస్తుండగా టూరిస్టు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపాలయ్య తీవ్రంగా గాయపడ్డారు. అదేమార్గంలో వస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి స్పందించి 108 అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం వద్ద గతనెల 29న ప్రియుడు, ప్రియురాలు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ప్రియుడు చాన్‌బాషా(40) చికిత్స పొందుతూ మరణించారు. కాగా ప్రియురాలు నాగమ్మ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రియుడు చాన్‌బాషా కూడా అదేరోజు రాత్రి నెల్లూరు నారాయణలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై హనీఫ్ సోమవారం తెలిపారు. ఈ క్రమంలో మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కోవూరు మండలం గంగవరంలోని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు స్పష్టం చేశారు.

దివ్యాంగుల ఉపకరణాలకు ప్రత్యేక శిబిరం



ఉపకరణాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న వృద్ధులు

మనుబోలు : దివ్యాంగులు, వృద్ధుల ఉపకరణాల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి దివ్యాంగులు, వయో వృద్ధులు హాజరై ఉపకరణాల కోసం రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జలజాక్షి మాట్లాడుతూ ఈ శిబిరానికి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఉపకరణాల కోసం 30 రిజిస్ట్రేషన్లు వచ్చినట్లు తెలియజేశారు. వారికి అవసరమైన ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, కళ్లజోళ్లు తదితర ఉపకరణాలను త్వరలోనే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు రాకేష్, స్పెషల్ ఎడ్యుకేటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

విడవలూరు : ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని ప్రిన్సిపల్ బి.సుజాత అన్నారు. స్థానిక పీఆర్ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఓడీ విద్యుల్లత, వి.శార్వాణి ప్రతి రంగంలో కంప్యూటర్ ఆవశ్యకతను, వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు, అతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇందుకూరుపేట : సంగం బ్యారేజీ నుంచి పెన్నా నదికి నీరు విడుదల చేశారని, నది పరీవాహక ప్రాంత గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్ సోమవారం కోరారు. నదిలోకి వెళ్లడం ప్రమాదకరమని తెలియజేశారు. మండల పరిధిలో పెన్నా పరీవాహక ప్రాంత గ్రామాలైన పల్లిపాడు, ముదివర్తిపాళెం, నిడిముసలి, కుడితిపాళెంలలో ప్రజలకు తెలిసేలా దండోరా వేయించాలని వీఆర్వోలకు సూచించారు.

వ్యాధుల కాలం.. జర భద్రం

- పెరుగుతున్న జ్వరపీడితుల సంఖ్య
- దోమల నివారణ కీలకం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఇర్ఫాన్

కోవూరు : చల్లని వాతావరణం, అనుకోని వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే వాధుల నుంచి దూరంగా ఉండొచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని వీధుల్లో నీరు నిల్వ ఉండడం వల్ల అపరిశుభ్రత నెలకొంది. దీంతో దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. కాగా మండల పరిధిలో జ్వరాలు ప్రబలుతున్నాయి. రోజూ ఇనమడుగు పీహెచ్‌సీకి 50 నుంచి 100 మందికిపైగా జ్వర పీడితులు వస్తున్నారు. ఈ సీజన్లో ప్రజలు ఎక్కువ మంది జ్వరాలతో బాధ పడుతున్నారని, జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించి తగిన వైద్యం పొందాలంటున్నారు. ప్రస్తుతం కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల లక్షణాలు

డెంగీ: ఈ వ్యాధి 10 నుంచి 15 రోజుల వరకు ఉంటుంది. దీనివల్ల జ్వరంతో పాటు తలనొప్పి అధికంగా ఉంటుంది. ఎక్కువగా నోటిపై, కంటి లోపల నొప్పి వస్తుంది. వాంతులు, కడుపు నొప్పి కూడా వస్తుంది.

మలేరియా: ఈ వ్యాధి 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం వచ్చినప్పుడు చెమటలు పట్టడం, తలనొప్పి, రోజు విడిచి రోజు జ్వరం రావడం, వాంతులు వంటివి ఈ వ్యాధి లక్షణాలు.

చికున్‌గున్యా : ఈ వ్యాధి కూడా 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. అయితే వ్యాధి తగ్గిన తర్వాత కూడా 7 నుంచి 10 రోజుల పాటు ఒంటి నొప్పులు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారికి అధిక జ్వరంతో పాటు బాడీ పెయిన్స్ ఉంటాయి.

మెదడు వాపు : ఈ వ్యాధి సోకిన వ్యక్తికి జ్వరంతో పాటు మత్తుగా ఉంటుంది. ఒక్కోసారి అపస్మారక స్థితికి వెళ్లిపోతారు. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ వ్యాధి 2 నుంచి 14 ఏళ్లలోపు వారికి అధికంగా వ్యాప్తి చెందే అవకాశాలున్నాయి.

దోమల నియంత్రణకు ఇలా చేయాలి

మురుగు కాలువల్లో పూడికతీసి నీరు పారేలా చేయాలి. కంప చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించుకోవాలి. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వారానికి ఒకసారి దోమల నివారణ మందు చల్లుకోవాలి. కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, సీసాలలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకూడదు. దోమలు కుట్టకుండా దోమ తెరలు, వేపాకుపొగ వేసుకోవాలి.

వైద్యులను సంప్రదించాలి

> మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా జ్వరాలు వస్తున్నాయి. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సిఫార్సుల మేరకు మందులు వాడాలి. అయినప్పటికీ జ్వరం తగ్గకపోతే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. దోమల నివారణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.
>
> – డాక్టర్ ఇర్ఫాన్, వైద్యుడు, ఇనమడుగు సీహెచ్‌సీ

వర్షపు నీటిని తొలగించండి

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



ముత్తుకూరు : వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు : పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, డీఆర్‌సీ ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త పరమశివమ్, కేవీకే శాస్త్రవేత్త కిరణ్, మండల వ్యవసాయాధికారి జోత్స్నరాణి తదితరులు సోమవారం మామిడిపూడి, తాళ్లపూడి, బ్రహ్మదేవి గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షపునీటిని తీసివేసిన తర్వాత ఒక సెంటు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వినియోగించాలని చెప్పారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలిచ్చారు.

జాగ్రత్తలు పాటించాలి

పొదలకూరు : రైతులు నారుమడుల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏఓ ఎ.వాసు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 5 సెంట్ల నారుమడిలో నీటిని తొలగించిన తర్వాత కేజీ యూరియాను చల్లుకోవాల్సిందిగా తెలిపారు. వరినాట్లు వేసిన పొలంలో మొత్తం నీటిని తొలగించి తగిన జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ప్రస్తుతం మండలంలో 2,300 ఎకరాల్లో వరినాట్లు పడినట్లు తెలిపారు. 544 ఎకరాల్లో మినుము, పెసర, కంది పంటలు సాగవుతున్నట్లు చెప్పారు.

శాస్త్రవేత్తల పరిశీలన

కోవూరు : భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు లలితా శివజ్యోతి, ఓబయ్య, మధుసూదనరావు బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల్లో నీరు తీసివేయగానే యూరియా 15-20 కిలోలు, పొటాష్ 15 కిలోలను ఎకరాకు వినియోగించాలన్నారు. ఏఓ ఇందిరావతి, వీఏఏలు చైతన్య, మౌనిక రైతులు పాల్గొన్నారు.

కాలువలు తీసుకోవాలి

మనుబోలు : నీట మునిగిన నారుమళ్ల నుంచి కాలువలు తీసి నీటిని తీసివేయాలని మండల ఏఓ షేక్ జహీర్ రైతులకు సూచించారు. తుఫాన్ నేపథ్యంలో మండలంలోని వెంకన్నపాళెం, పిడూరుపాళెం గ్రామాల పరిధిలోని వ్యవసాయ పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రస్తుతానికి నారుమళ్లకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం లేదన్నారు. అయితే రైతులు నారుమళ్లలో నీటిని వెంటనే తొలగించాలన్నారు. ఏఈఓ కళారాణి, వీఏఏలు తేజస్విని, ఇర్షాద్ ఉన్నారు.

బూస్టర్ డోస్ ఎరువులు వేయండి

కొడవలూరు : రైతులు తమ పొలాల్లో వర్షపు నీటిని వెంటనే తొలగించి బూస్టర్ డోస్ ఎరువులు వేసుకోవాలని కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో నీట మునిగిన వరి పొలాలను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీకే కో-ఆర్డినేటర్ శివజ్యోతి మాట్లాడుతూ బూస్టర్ డోస్ కింద ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలని చెప్పారు. తరువాత కార్బన్ డిజమ్ ఒక గ్రాము, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. నారుమడిలో అయితే ఐదు సెంట్లకు కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త ఓబయ్య, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త మధుసూధన్, కోవూరు ఏడీఏ డి.సుజాత, ఏఓ లక్ష్మి, వీఏఏ ఆర్.నిహారిక ఉన్నారు.

సస్యరక్షణతో పంటను రక్షించుకోవచ్చు

తోటపల్లిగూడూరు : సరైన సస్యరక్షణ చర్యలతో నీట మునిగిన పంటను రక్షించుకోవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని వరిగొండ, చిన్నచెరుకూరు పంచాయతీల్లో భారీ వర్షాలకు ముంపునకు గురైన వరిపొలాలను జిల్లా వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ నాట్లు వేసిన వారం నుంచి పది రోజులకు పంటలో ఆకుముడత వచ్చే అవకాశం ఉందని, ఎకరాకు 400 మిల్లీలీటర్ల క్లోరోఫైరిఫాస్‌ను 200 లీటర్ల నీటితో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. ఏడీఏ రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు పరమశివ, కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల ఏఓ శిరీషారాణి, వీఏఏలు సుమంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు



మనుబోలు : పొలాలను పరిశీలిస్తున్న ఏఓ జహీర్



కొడవలూరు : రామన్నపాళెంలో సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు



తోటపల్లిగూడూరు : వరిగొండలో..

ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలి

కోవూరు : విద్యార్థి దశ నుంచే ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని కోవూరులోని వైకేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీప్రసూన తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం మాట్లాడారు. కోవూరులోని తమ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణా తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. బుధవారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే శిక్షణను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 63015 29271 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఇందుకూరుపేట : ఏఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కొమరిక గిరిజన కాలనీ వాసులకు నిత్యావసర సరుకులు, టార్పలిన్ పట్టలను సోమవారం పంపిణీ చేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కాలనీలోకి నీరువచ్చి గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి స్వచ్ఛంద సేవా సంస్థ సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్‌డీ సంస్థ చైర్మన్ బషీర్, స్థానిక నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.